క్లుప్తంగా

మొక్కల సంరక్షణ ముఖ్యం



పాన్‌గల్: మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించి క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు అన్నారు. శనివారం మండలంలోని గోప్లాపూర్ గ్రామ నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఏపుగా పెరగాలంటే వాటర్ క్యూరింగ్ బాగా చేయాలన్నారు. జీపీకి నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెరిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలు, ప్రకృతి వనం మొక్కలకు నీరు పట్టాలని సూచించారు. ఎండిన మొక్కల స్థానంలో వేరే మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బద్రూనాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మాలల అభ్యున్నతికి కృషి



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన వేటూరు రవీందర్ దాసును జిల్లా మాలల చైతన్య సమితి అధ్యక్షుడిగా నియమించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మూలే కేశవులు చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్న రవీందర్‌దాస్ మాలల హక్కుల పరిరక్షణ కోసం తమవంతు బాధ్యతగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో అవుట కేశవులు, ఆంజనేయులు, వెంకటస్వామి, మద్దిలేటి, చిన్నికృష్ణ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

పాన్‌గల్: అనారోగ్యంతో మృతిచెందిన బుసిరెడ్డిపల్లి గ్రామ పారిశుద్ధ్య కార్మికుడు వెంకటయ్య కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము డిమాండ్ చేశారు. శనివారం గ్రామాన్ని సందర్శించి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాల కోసం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేసి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని సర్పంచ్ సింధూజ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వాల్మీకినాయుడు, పంచాయతీ కార్యదర్శి కృష్ణమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం సర్పంచ్ వెంకటరమణ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు 10వ తరగతి లో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశ్యంతో స్టడీ మెటీరియల్ అందిస్తున్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అర్జున్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి ధన్యవాదాలు

వనపర్తి టౌన్: అయోధ్య ఎయిర్‌పోర్ట్‌కు మహర్షి వాల్మీకి ఎయిర్‌పోర్ట్‌గా పేరు పెట్టడం హర్షణీయమని వాల్మీకి సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్ననాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రధానమంత్రి మోదీకి తెలంగాణ వాల్మీకి సంఘం తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్య రామ మందిరం జనవరి 22న విగ్రహ ప్రతిష్ఠతో ప్రారంభమవుతుందని, అదేవిధంగా మహర్షి వాల్మీకి మందిరాన్ని సైతం ఏర్పాటు చేయాలని కోరారు. మహర్షి వాల్మీకి జయంతిని నేషనల్ హాలీ డే గా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో బాలస్వామి నాయుడు, రవి నాయుడు, బుసిరెడ్డి, స్వామి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు ఇవ్వని రైతువేదికలు



నిరుపయోగంగా శిథిలావస్థకు చేరుతున్న బొల్లారం రైతువేదిక

- మండలంలో రూ.1.20కోట్ల ఖర్చు
- రైతులకు చేకూరని ప్రయోజనం
- ఆందోళన కలిగిస్తున్న నిర్వహణ లోపం
- శిథిలావస్థకు చేరుతున్నా స్పందించని అధికారులు

వీపనగండ్ల: మండలంలోని రైతులకు పంటల సాగులో అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఉపయోగకరంగా ఉంటాయన్న ఉద్దేశంతో నిర్మించిన రైతువేదికలు సరైన నిర్వహణ లేక పలు క్లస్టర్ గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన రైతు వేదికలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

ఒక్కో రైతువేదికకు రూ.22లక్షలు

మండలంలోని బొల్లారం, తూంకుంట, గోపల్‌దిన్నె, వీపనగండ్ల, కల్వరాల, పుల్గర్‌చర్ల క్లస్టర్ గ్రామాల్లో రూ.12 లక్షలు ఉపాధి హామీ పథకం ద్వారా, మరో రూ.10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఒక్కొక్క రైతు వేదిక నిర్మాణం కోసం రూ.22 లక్షలు ఖర్చు చేశారు. బొల్లారం, తూంకుంట, పుల్గర్‌చర్ల గ్రామాల్లో గ్రామానికి దూరంగా నిర్మించడంతో వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక పోతున్నారు. సంగినేనిపల్లిలో నిర్మించాల్సిన రైతువేదికను పుల్గర్‌చర్లలో నిర్మించడంతో తమ గ్రామంలో కూడా రైతువేదిక మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గ్రామానికి దూరంగా తూంకుంట రైతువేదిక

అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా..

గ్రామాలకు దూరంగా ఉన్న రైతువేదికల వద్ద పలు అసాంఘీక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయి. చీకటి పడిన వెంటనే మద్యం ప్రియులు రైతువేదికల వద్దకు వెళ్లి మద్యం తాగుతున్నారు. కంపౌండ్ వాల్ నిర్మించకపోవడంతో ఇలాంటి పరిస్థితి దాపరిస్తుందని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతు వేదికలకు అవసరమైన ఫర్నీచర్‌తో పాటు విద్యుత్ వసతి, మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కంపౌండ్ వాల్ నిర్మించాలి



రైతువేదికల వద్ద కంపౌండ్ వాల్ నిర్మించకపోవడం వల్లే అసాంఘీక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రత్యేక నిధులు మంజూరు చేసి రైతువేదికలకు కంపౌండ్ వాల్ లేదా ముళ్ల కంచెలు ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

– బాలాజీ, రైతు గోపల్‌దిన్నె

స్థలాల ఎంపికలో పొరపాట్లు



రైతువేదికల నిర్మాణం కోసం స్థలాలను ఎంపిక చేయడంలోనే పొరపాట్లు దొర్లాయి. గ్రామాలకు దూరంగా ఉండి రైతులకు ఉపయోగపడని రైతువేదికల నిర్మాణం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. కనీస వసతులు లేకపోవడం వల్ల అటుగా రైతులు వెళ్లడం లేదు. అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– రామస్వామి, మాజీ సర్పంచ్, పుల్గర్‌చర్ల

రైతుల అవసరాలకే..



మండలంలో నిర్మించిన రైతు వేదికలను రైతుల అవసరాల కోసమే వినియోగిస్తున్నాం. క్లస్టర్ స్థాయి అధికారులు రైతు వేదికల వద్దే రైతులను సమీకరించి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రైతు వేదికల వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతాం.

– దాకేశ్వర్ గౌడ్, ఏఓ, వీపనగండ్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శ్రీరంగాపురం దరఖాస్తు ఫారాల కోసం గుమిగూడిన ప్రజలు

పెబ్బేరు రూరల్: అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనా కార్యక్రమం చేపట్టిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని అయ్యవారిపల్లి, యాపర్ల గ్రామాల్లో ఆయన పాల్గొని ప్రజలతో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు స్వాతి, చంద్రకళ, ఉపసర్పంచ్ మద్దిలేటి, రామకృష్ణ, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఈ మేఘారెడ్డి, కాంగ్రెస్ మండల బ్లాక్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఎద్దుల విజవర్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, వెంకటేసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాలలో 864, కానాయపల్లి 842, రాయిణిపేట 660, పామాపురం 21, అమడబాకుల 90, పాలెం 114, నాటవెల్లి పెద్దతండా 30, నాటవెల్లి 23, నిర్వేన్ 36, సత్యహల్లి 02, భూత్‌కూర్ 08 దరఖాస్తులు వచ్చాయి. మూడు రోజులుగా మండలంలో మొత్తంగా 5,460 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. అప్పరాలలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సర్పంచ్ హిమబిందు పాల్గొన్నారు.

పాన్‌గల్: మూడో రోజు శనివారం మండలంలోని దావాజిపల్లిలో 355, దావత్‌ఖాన్‌పల్లిలో 151, గోప్లాపూర్‌లో 378 దరఖాస్తులు కలిపి మొత్తం 884 దరఖాస్తులు వచ్చినట్లు మత్స్యశాఖ ఏడీ, మండల ప్రత్యేకాధికారి రహమాన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాయి, ఇన్‌చార్జీ ఎంపీడీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, మండల పశువైద్యాధికారి డా.శ్యామ్, సర్పంచ్‌లు వెంకటయ్యయాదవ్, నాగేష్‌నాయుడు, రాణి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పట్టణంలోని పది వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కౌంటర్లను మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ మూడోరోజు పరిశీలించారు. మూడో రోజు ఆయా కౌంటర్ల ద్వారా 505 మంది దరఖాస్తులు అందించారని అధికారులు తెలిపారు. అధికారులు ఎల్లస్వామి, నారాయణ పాల్గొన్నారు.

1,060 దరఖాస్తులు

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నెలో 365, సంగినేనిపల్లిలో 695 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. సంగినేనిపల్లి ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులకు తగు సూచనలు ఇచ్చారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లి, కర్నె తండా, ఆముదంబండ తండా, మల్కిమియాన్‌పల్లి గ్రామాల్లో ప్రజాపరిపాలనలో భాగంగా సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ పాండు నాయక్, ఎంపీఓ రాజు తెలిపారు. నాలుగు గ్రామాల్లో మొత్తం 969 దరఖాస్తులు వచ్చినట్లు వారు చెప్పారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దతండా, ఆర్.పెద్దతండా, డి.పడమటితండా, రాజపేట, పెబ్బేరు మండలంలోని యాపర్ల, అయ్యవారిపల్లి, శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో ప్రజా పాలన కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించారు. వనపర్తిలో 723, పెబ్బేరులో 747, శ్రీరంగాపురం మండలంలో 296 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ప్రవీణ్‌కుమార్, ప్రసన్నకుమారి, సుదర్శన్, తహసీల్దార్లు మురళీగౌడ్, లక్ష్మి, యాదగిరి ఉన్నారు.



అప్పరాలలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీడీఓ కృష్ణయ్య



దావాజిపల్లిలో..



మల్కిమియాన్‌పల్లిలో..



సంగినేనిపల్లిలో అధికారులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి

పత్రాల పంపిణీలో వాగ్వివాదం

ప్రజా పాలనకు చెందిన కలర్ దరఖాస్తు ఫారాలు ముందు రోజే ఇంటింటికి తిరిగి ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. కానీ శ్రీరంగాపురం మండల కేంద్రంలో మాత్రం అధికారులు శనివారం పాత గ్రామ పంచాయతీ చెట్టు వద్ద దరఖాస్తు ఫారాలు పంపిణీ చేస్తుండగా.. పెద్ద మొత్తంలో అర్హులు ఒకేసారి అక్కడికి రావడంతో ఫారాలు దొరకక అధికారులతో గొడవకు దిగారు. అందరికీ అవసరమైన దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచకపోవడంలో ప్రభుత్వ అసమర్థత కనబడుతుందని బీఆర్‌ఎస్ నాయకులు దుయ్యబట్టారు. దీనిపై అధికారులు స్పందిస్తూ తమతో అందుబాటులో ఉన్న ఫారాలు అందించామని, మన గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమం జనవరి 3వ తేదీన ఉన్నందున అప్పటి వరకు గ్రామంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కలరు దరఖాస్తు పత్రాలు అందజేస్తామని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని పంచాయతీ కార్యదర్శి నందకిషోర్ గ్రామ ప్రజలకు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని సీఆర్పీలు గోవింద్‌నాయక్, సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని రాయినిపల్లిలో బడి మానేసిన 2వ తరగతి విద్యార్థి మల్లేష్‌ను స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యలో బడి మానేసిన విద్యార్థులను గుర్తించేందుకే ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. బడిఈడు కలిగిన పిల్లలను క్రమం తప్పకుండా బడులకు పంపిస్తూ ప్రభుత్వ బడుల బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు అందిస్తున్నారని, చదువు యొక్క ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. సీఆర్పీలురమాదేవి, భార్గవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అమరచింత: బడిఈడు పిల్లలందరూ బడిలో విద్యను అభ్యసించాలని సీఆర్పీ స్వామి అన్నారు. పట్టణంలో శనివారం బడి బయటి విద్యార్థుల గుర్తింపు సర్వేను నిర్వహించారు. బడిమానిన ముగ్గురు విద్యార్థులను మళ్లీ బడిలో చేర్పించినట్లు ఆయన తెలిపారు. డీఎంఆర్‌ఎం పాఠశాల హెచ్‌ఎం బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



బడిలో చేర్పించిన విద్యార్థితో సీఆర్పీలు

బేడబుడగ జంగాలకు న్యాయం చేయాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి 22వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కొత్తకోట బుడగ జంగం సంఘం నాయకులు శనివారం పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, స్థానిక చౌరస్తాలో బాణా సంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జెండాను ఉమ్మడి జిల్లా ఎస్సీ కులాల ప్రధాన కార్యదర్శి వై.సాంబశివుడు, వనపర్తి జిల్లా అధ్యక్షుడు జమ్మన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు బేడ బుడగ జంగాల గురించి పట్టించుకోవడం లేదని, తమను ఓటర్లుగానే చూస్తున్నారని, తమ యోగక్షేమాల గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెలిమిళ్ల రాజు, ఎస్.కరుణాకర్, మనోహర్, విజయ్, ఎల్లప్ప, ఈశ్వర్, శ్రీరాములు, లక్ష్మణ్, శివన్న, శివ, సురేష్, శ్రీనివాసులు, గోపి, శంకర్, గోవింద్, ఆంజనేయులు, మన్యం తదితరులు పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తకోట: తెలంగాణ ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు భారతీయ సంస్కృతి, సాంప్రదాయం, నైతిక విలువలు కలిగిన విద్యను పౌరులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణయ్య, హెచ్‌ఎం నిర్మలాదేవి, శివనారాయణ, దేవన్న, కృష్ణ, లక్ష్మయ్య, రాములు, రాఘవేందర్‌రెడ్డి, రాఘవేంద్రచారి, అరవింద్, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండయ్య, బాలరాజు, జలేందర్‌రెడ్డి, బేతన్‌గౌడ్, నరేంద్రగౌడ్, లక్ష్మీనాగమణి, నలిని, అపర్ణ తదితరులు ఉన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూర్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం 2024 క్యాలెండర్‌ను శనివారం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ కోటేష్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్ ఆవిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు బాలరాజు, కరుణాకర్, శ్రీనివాస్, సుదర్శన్, తపస్ నాయకులు ఒగ్గు ఉమాశంకర్, విజయభాస్కర్, జన్ను భాస్కర్, శాంతన్న, నారాయణ, కృష్ణయ్య, రమేష్ ఉన్నారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

క్రీడలు మానసికోల్లాన్నిస్తాయి



అమరచింతలో ఆటపోటీలను తిలకిస్తున్న ఎస్‌ఐ జగన్మోహన్

అమరచింత: క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆటపోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కలాం పాషా మాట్లాడుతూ కొన్నేళ్లుగా తమ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆటపోటీల్లో గెలుపొందిన వారికి డిసెంబర్ 31న బహుమతులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బలరాముడు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని మాంటిస్సోరీ ప్లేవే స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలు శనివారం మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ ప్రారంభించారు. పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో మాంటిస్సోరీ ప్లేవే స్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుపొందగా, మోడల్‌స్కూల్ రెండో బహుమతి, జూనియర్ విభాగంలో మాంటిస్సోరీ ప్లేవే స్కూల్ విద్యార్థులు ప్రథమ, జెడ్పీహెచ్‌ఎస్ కంచిరావుపల్లి విద్యార్థులు రెండో బహుమతి సాధించగా.. విజేతలకు పాఠశాల డైరెక్టర్ రాజేందర్‌గౌడ్ బహుమతులు అందజేశారు.

సైబర్‌క్రైం కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి పీఎస్‌లో శనివారం సైబర్‌క్రైం కేసు నమోదు అయిందని ఎస్ శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గౌరిదేవిపల్లికి చెందిన కృష్ణ డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. నవంబరు 3, 2023 అతడికి టెలిగ్రాం యాప్‌లో తమ బిజినెస్‌కు అనుకూలంగా రివ్యూ ఇస్తే డబ్బులు ఇస్తామని, ముందుగా కొంత డబ్బులు పంపాలని మెసేజ్ వచ్చింది. అది నమ్మిన కృష్ణ అనుకూలంగా రివ్యూ ఇచ్చి రూ.వెయ్యి పంపగా రూ.1,400 రిటర్న్ వేశారు. మళ్లీ రూ.మూడు వేల పంపితే రూ.ఐదు వేలు వస్తాయని చెప్పారు. రూ. 3వేలు పంపిన తర్వాత డబ్బులు రాలేదని, మరో రూ.తొమ్మిది వేలు పంపితే రూ.18వేలు పంపిస్తామని చెప్పగా రూ.తొమ్మిది వేలు పంపాడు. ఆ తర్వాత అవతలి నుంచి సమాధానం కాలేదు. తేరుకున్న బాధితుడు ఆన్‌లైన్‌లో అదే రోజు కంప్లెంట్ ఇచ్చాడు. తిరిగి శనివారం రేవల్లి పీఎస్‌లో ఆన్‌లైన్‌లో రూ.12వేలు మోసపోయానని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ఖిల్లాఘనపురం: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఇన్‌చార్జ్‌గా ఖిల్లాఘనపురం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మున్నూరు జయకర్‌ను నియమించారు. ఈ సందర్భంగా జయకర్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్మన్ మనుజైన్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మాజీమంత్రి చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సాయం అందిస్తాం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని తొలకరి చినుకు లు పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు సాయం తప్పకుండా ఎప్పటికీ ఉంటుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. పదిహేను రోజులుగా పాఠశాలలో జిల్లాలోని ఇరవై అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు శిక్షణ అందించామని పాఠశాల నిర్వాహకురాలు పరిమళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అంగన్‌వాడీ టీచర్లు వారి వారి కేంద్రాల్లో పిల్లలకు మంచి మెలకువలు నేర్పించాలని సూచించారు.

బైక్ చోరీ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండల కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి వద్ద బైక్ చోరీ జరిగిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న అందించిన వివరాల ప్రకారం.. కొల్లాపూర్‌కి చెందిన వెంకటస్వామి మధ్యాహ్నం మాతా శిశు సంరక్షక్ ఆస్పత్రి వద్ద బైక్ నిలిపి, పని మీద వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి అతని బైక్ కనబడలేదు. వెంటనే బాధితుడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో షాపు దగ్ధం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 23వ వార్డు వల్లభ్‌నగర్‌లో మణిదీపిక లేడీస్ కార్నర్ అండ్ జనరల్ స్టోర్‌లో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. కాంగ్రెస్ నాయకుడు నాగరాజు ఎమ్మెల్యే మేఘారెడ్డికి సమాచారం ఇవ్వగా ఆయన శనివారం షాపును పరిశీలించి, కాలిపోయిన షాపును పంచనామా చేసి రిపోర్ట్ ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. త్వరలో ప్రభుత్వం తరుపున నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చి, షాపు యజమానురాలు స్వప్నకు ఎమ్మెల్యే రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్ రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో లక్కాకుల సతీష్, చీర్ల విజయచందర్, మన్నెంకొండ, కౌన్సిలర్లు విభూది నారాయణ, చీర్ల సత్యం, జయసుధ, సుమిత్ర, కోఆప్షన్ సభ్యురాలు ఖైరున్ షఫీ పాల్గొన్నారు.



దగ్ధమైన షాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

సంబరాలు శృతి మించితే జైలుకే..

ఆత్మకూర్: సంబరాలు శృతి మించితే జైలుపాలు కావడం ఖాయమని, డిసెంబర్ 31 సందర్భంగా తప్ప తాగి రోడ్లపై అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ కేఎస్ రత్నం, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ 2023 ఏడాది చివరి రోజు సందర్భంగా ఆదివారం రాత్రి రోడ్లపై ఆంక్షలు విధించామన్నారు. ఎస్పీ రక్షిత కే మూర్తి ఆదేశాల మేరకు ప్రశాంత వాతవరణంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని సూచించారు. తాగి వాహనాలు నడిపిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేసి లైసెన్సులు రద్దు చేయిస్తామన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

వనపర్తి టౌన్: విద్యార్థుల, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి దశాబ్దాల నుంచి పోరాటాలు చేస్తున్న ఏకైక సంస్థ ఎస్‌ఎఫ్‌ఐ అని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని సూర్య ఒకేషనల్ జూనియర్ కళాశాల ఎదుట భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం కలిసి ఉన్న జెండాను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు మల్లేష్ ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రసాద్, భరత్, అవినాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తులు భద్రం

అమరచింత: మూడు రోజులుగా ప్రజల నుంచి ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఆరు గ్యారెంటీల దరఖాస్తులను భద్రంగా బాక్స్‌లో పెట్టి సీల్ చేశారు. ఆది, సోమ వారాలు సెలవు కావడంతో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ఇనుప పెట్టెలో వార్డుల వారీగా విభజించి భద్రపర్చామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు.